# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 24-10-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **కర్నూలు జిల్లాలో ఈ తెల్లవారుజామున జరిగిన బస్సు ప్రమాదంలో 19 మంది మృత దేహాలను వెలికితీశారు.**

2. **కర్నూలు బస్సు ప్రమాద మృతుల కుటుంబాలకు 2 లక్షలు, క్షత గాత్రులకు 50వేల రూపాయల పరిహారాన్ని ప్రకటించిన ప్రధానమంత్రి.**

3. **అటవీ భూముల సంరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని ఉపముఖ్యమంత్రి కె పవన్ కల్యాణ్ తెలిపారు.**

4. **యువతకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు రోజ్ గార్ మేళాలు ఉపయోగపడతాయని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ పేర్కొన్నారు.**

5. **పెట్టుబడులు పెట్టేందుకు తగిన వనరులు ఆంధ్రప్రదేశ్ లో అందుబాటులో ఉన్నాయని ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ వెల్లడించారు.**

==========================

కర్నూలు జిల్లాలో ఈ తెల్లవారుజామున బస్సులో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. కల్లూరు మండలం, చిన్న టేకూరు వద్ద హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న ప్రయివేట్ ట్రావెల్స్ బస్సును ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో ప్రమాదం జరిగిందని జిల్లా కలెక్టర్ ఏ. సిరి తెలిపారు. బైక్ ఢీకొన్న తర్వాత మంటలు చెలరేగడం వల్ల ప్రమాదం జరిగిందని ఈ ఘటనలో 19 మంది మృతదేహాలను వెలికితీశామని చెప్పారు. ప్రమాద ఘటనపై ఆమె ఈ రోజు పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్ 20 సెకన్లు

ప్రమాదం జరిగిన స్థలాన్ని కర్నూలు పార్లమెంట్ సభ్యురాలు బి. శబరి, రవాణాశాఖ మంత్రి ఎం. రాంప్రసాద్ రెడ్డి, హోం మంత్రి వి.అనిత పరిశీలించారు. ప్రమాదం జరగడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

-------------------------

ఇక ఈ ప్రమాద ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం

చేశారు. ప్రమాదంలో ప్రాణనష్టం జరగడం తీవ్రంగా కలచివేసిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందిస్తూ," కర్నూలులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాద ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రధానమంత్రి సహాయ నిధి కింద మృతుల కుటుంబాలకు 2 లక్షల రూపాయలు, క్షత గాత్రులకు 50వేల రూపాయల చొప్పున పరిహారాన్ని ప్రకటించారు. ఈ ఘటనపై ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ విచారం వ్యక్తం చేశారు.అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయిడు ఉపముఖ్యమంత్రి కె పవన్ కల్యాన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేసారు.

ఈ ప్రమాదంలో మృతిచెందిన తెలంగాణ పౌరుల కుటుంబాలకు 5 లక్షల రూపాయలు, గాయపడిన వారికి 2 లక్షల రూపాయల ఆర్థిక సాయాన్ని ఆ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

-------------------------

కర్నూలు జిల్లాలో జరిగిన బస్సు ప్రమాదంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దుబాయ్ నుంచి అధికారులతో శ్రవణ మాధ్యమం ద్వారా సమీక్ష నిర్వహించారు. అక్కడ చేపట్టిన సహాయక చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, బస్సు ప్రమాదంలో పెద్దసంఖ్యలో ప్రయాణికులు చనిపోవడంపై విచారం వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు అత్యుత్తమ వైద్యాన్ని అందించాలని, మృతదేహాలను త్వరితగతిన గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించాలని ఆదేశించారు. బాధిత కుటుంబాలను ఆదుకోవాలని గాయపడ్డవారికి పూర్తి స్థాయిలో వైద్యం అందేలా అధికారులు, మంత్రులు పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఘటనపై పూర్తి విచారణ జరిపి నివేదిక అందించాలని ఆదేశించారు.

-------------------------

అటవీ భూముల సంరక్షణకు ప్రభుత్వం ప్రాధ్యాన్యతనిస్తోందని ఉపముఖ్యమంత్రి కె పవన్ కల్యాణ్ తెలిపారు. కృష్ణాజిల్లా గన్నవరంలో నిర్వహించిన అటవీశాఖ రాష్ట్ర స్థాయి అధికారుల కార్యశాలలో ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, అడవుల పరిరక్షణకు మొక్కల పెంపకానికి ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. గిరిజన ప్రాంతాల్లోనూ మొక్కల పెంపకానికి నర్సరీలను ఏర్పాటు చేస్తామని పవన్ కల్యాణ్ పేర్కొంటూ,

వాయిస్ 32 సెకన్లు

-------------------------

దేశవ్యాప్తంగా 41 ప్రదేశాలలో నిర్వహిస్తున్న రోజ్‌గార్ మేళా కార్యక్రమంలో భాగంగా దృశ్య మాధ్యమం ద్వారా కొత్తగా నియమితులైన 51,000 కి పైగా నియామక పత్రాలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు అందచేశారు. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ పాల్గొని 69 మందికి నియామక పత్రాలు అందించారు. యువతకు ఉపాధి అవకాశాలను కల్పిస్తూ, దేశ నిర్మాణంలో భాగస్వాములను చేసేందుకు రోజ్ గార్ మేళాలు ఉపయోగపడతాయని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పేర్కొంటూ,

వాయిస్ 24 సెకన్లు

---------------------------

కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆర్థిక సేవల విభాగం ఆధ్వర్యంలో ఈరోజు నుండి డిసెంబర్ 31 వరకు 'మీ మూలధనం – మీ హక్కు' ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ కన్వీనర్ సివిఎన్ భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ బ్యాంకులు, ఆర్థిక సంస్థలలో ఉన్న క్లెయిమ్ చేయని డిపాజిట్లను వాటి ఖాతాదారులు, హక్కుదారులు తిరిగి పొందే విధానంపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో అవగాహన శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు .ఈ శిబిరాలలో ప్రజలు పాల్గొని బ్యాంక్ ఖాతాల వివరాలను తెలుసుకోవడమే కాకుండా క్లయిమ్ చేయని డిపాజిట్లు అసలైన లబ్దిదారులకు అందేలా 'మీ మూలధనం మీ హక్కు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సి.వి.ఎన్. భాస్కరరావు పేర్కొన్నారు.

---------------------------

వస్తు సేవల పన్ను – జీఎస్టీ స్లాబులు తగ్గింపు ద్వారా నిత్యావసరాలతో పాటు ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్ వంటి వస్తువుల ధరలు అందుబాటులోకి వచ్చాయని బాపట్ల జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో 12 శాతం పన్నులో ఉన్న వస్తువులన్నీ దాదాపుగా 5 శాతంకి వచ్చాయని, 28 శాతం పన్నులో ఉన్న వస్తువులు 18 శాతం స్లాబులోకి వచ్చాయని తెలిపారు. వీటి ఫలితంగా సామాన్యులకు ఆర్థిక వెసులుబాటుతో పాటుగా వ్యాపారులకు సైతం అమ్మకాలు పెరిగాయని బాపట్ల జిల్లా ఛాంబర్ అఫ్ కామర్స్ అధ్యక్షులు టి.సురేష్ తెలిపారు.

---------------------------

పెట్టుబడులు పెట్టేందుకు తగిన వనరులు ఆంధ్రప్రదేశ్ లో అందుబాటులో ఉన్నాయని ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో భారత పరిశ్రమల సమాఖ్య– సిఐఐ నిర్వహించిన భాగస్వామ్య సదస్సు రోడ్‌షోలో మంత్రి ఈ రోజు పాల్గొని రాష్ట్రంలో పెట్టుబడి పెట్టేందుకు ఉన్న అవకాశాల గురించి వివరించారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ,

వాయిస్ 31 సెకన్లు

---------------------------

ఈరోజు ఐక్యరాజ్య సమితి ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ప్రపంచదేశాల మధ్య మైత్రీ సంబంధాలు పెంపొందించడం, అంతర్జాతీయ శాంతి భద్రతలను కాపాడడం, దేశాల ఆర్థికాభివృద్ధికి కృషి చేయడం వంటి లక్ష్యాలతో 1945 అక్టోబర్ 24 వ తేదీన ఐక్య రాజ్య సమితి ఆవిర్భించింది. అప్పటి నుండి ప్రతిఏటా ఇదే రోజును ఐక్యరాజ్య సమితి దినోత్సవంగా పాటిస్తున్నారు.

---------------------------

ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. ఇది రానున్న 24 గంటల్లో పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ బలపడే అవకాశం ఉందని వెల్లడించింది. దీని ప్రభావంతో రానున్న ఐదు రోజుల పాటు రాష్ట్రంలో అక్కడక్కడ భారీ వర్షాలు, కొన్నిచోట్ల అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

=====================